జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఖమ్మం
శనివారం | 5 | సెప్టెంబర్ | 2026 • పేజీలు : 6

# 333% పెరిగిన విద్యార్థుల నమోదు



- ప్రభుత్వ పాఠశాలపై పెరిగిన నమ్మకం, బాధ్యత
- ఇది సమిష్టి కృషి
- ఉమాదేవి, ప్రధానోపాధ్యాయులు,

**పాలేరు ఆర్.సీ సెప్టెంబర్ 04 ప్రజా జ్యోతి** విద్యార్థులు లేక బోసిపోయిన పాఠశాల నేడు కళకళలాడుతోంది, 333% రేటుతో విద్యార్థుల నమోదులో జిల్లాలోనే మేటిగా నిలిచింది. ప్రధానోపాధ్యాయురాలి

మిగతా 2 లో...

# ఎలా ఉన్నావమ్మా... అక్షిత...

- తల్లంపాడులో చిన్నారిని పరామర్శించి, ఆర్థిక సాయం అందజేసిన రాష్ట్ర మంత్రి పొంగులేటి...



**ఖమ్మం రూరల్ ప్రజా జ్యోతి:** తలంపాడు గ్రామానికి చెందిన మూడో తరగతి విద్యార్థిని రెంటాల అక్షిత గతంలో తన అమ్మమ్మతో కలిసి బస్సులో వెళ్లి వస్తుండగా.. కిటికీ వద్ద కూర్చున్న చిన్నారి చేతికి మరో బస్సు ప్రమాదవశాత్తు తగిలి కుడి చేతికి తీవ్రగాయమైంది. గ్రామ సర్పంచ్ కుమ్మరి అంబేద్కర్ ద్వారా విషయం తెలుసుకుని.. గతంలో కిమ్స్ ఆస్పత్రిలో మంత్రి తరఫున చికిత్స చేయించగా పూర్తిగా కోలుకుంది. తాజాగా శుక్రవారం రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆ చిన్నారి ఇంటికి వెళ్లి.. యోగక్షేమాలు తెలుసుకున్నారు. బాగా చదువుకోవాలని, తన ప్రోత్సాహం ఎల్లప్పుడూ ఉంటుందని అభయమిచ్చారు. అలాగే ఆ బాలిక కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో...: కాంగ్రెస్ మండలాధ్యక్షులు తోట వీరభద్రం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మద్ది మల్లారెడ్డి, సర్పంచ్ కుమ్మరి అంబేద్కర్, కస్నా తండా సర్పంచ్ పాపా నాయక్, ఏఎంసీ డైరెక్టర్లు కృష్ణ, పంతులు నాయక్, గ్రామ పెద్ద ఎన్ వీ, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# మహిళలు ఆర్థికంగా ఎదిగి కోటీశ్వరులవ్వాలి..

## మంత్రి సీతక్క

పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)

- మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇందిర మహిళాశక్తి పథకం అండ
- మహిళా సంఘాలకు అండగా ప్రభుత్వం.. వడ్డీ లేని రుణాలు, ఉపాధి అవకాశాలు
- సత్తుపల్లిలో ఇందిర మహిళాశక్తి సదస్సు లో పాల్గొని మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ చేసిన మంత్రి సీతక్క

**సత్తుపల్లి సెప్టెంబర్04(ప్రజా జ్యోతి)** మహిళలు ఎవరి మీద ఆధారపడకుండా స్వతంత్రంగా జీవిస్తూ, ఆర్థికంగా ఎదిగి కోటీశ్వరులుగా మారాలన్నదే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. మహిళల చేతుల్లో డబ్బు ఉండాలని, తమకు నచ్చిన విధంగా జీవించే ఆర్థిక స్వేచ్ఛను కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. శుక్రవారం సత్తుపల్లి పట్టణంలోని సిద్దారం రోడ్డులో గల ఎం.ఆర్. గార్డెన్స్ ఫంక్షన్ హాల్‌లో 1000 రోజుల ప్రజా పాలనలో

మిగతా 6 లో...

# తిరుమలాయపాలెంలో సోషల్ మీడియా రాజకీయ వేడి..

- రోజుకో పోస్టు.. గంటకో కౌంటర్.. కాంగ్రెస్- బి ఆర్ ఎస్
- మాటల యుద్ధంపై మండలంలో చర్చ.!




**తిరుమలాయపాలెం, ప్రజాజ్యోతి సెప్టెంబర్ 04:.** రుమలాయపాలెం మండలంలో రాజకీయ చర్చకు ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా మారుతోంది. కాంగ్రెస్,బీఆర్ఎస్ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తమ తమ పార్టీల విధానాలను సమర్థిస్తూ.. ప్రత్యర్థి పార్టీపై విమర్శలు చేస్తూ పోస్టులు పెట్టడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఒక వైపు అధికార కాంగ్రెస్ పాలనలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రస్తావిస్తుండగా.. మరో వైపు బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వం ఇచ్చిన హామీలు, అమలు తీరుపై

మిగతా 2 లో...

# ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

- బాలకృష్ణుడి వేషధారణలో చిన్నారుల సందడి.. ఆలయాల్లో ప్రత్యేక పూజలు



**తిరుమలాయపాలెం, ప్రజాజ్యోతి, సెప్టెంబర్ 4:** తిరుమలాయపాలెం మండలంలోని పలు గ్రామాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించి శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు

మిగతా 2 లో...

## ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

(మొదటి పేజీ తరువాయి...)

నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా చిన్నారులను బాలకృష్ణుడి వేషధారణలో అలంకరించడంతో గ్రామాల్లో సందడి నెలకొంది. కృష్ణుడి వేషధారణలో చిన్నారులు చూపరులను ఆకట్టుకున్నారు. పలు గ్రామాల్లో భజనలు, కీర్తనలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీకృష్ణుడి జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వేడుకల్లో మహిళలు, చిన్నారులు, యువత, భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. శ్రీకృష్ణుడి ఆశీస్సులతో మండల ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని పలువురు ఆకాంక్షించారు.

# రోడ్ల పక్కన చికెన్ వ్యర్థాల కుప్పలు..!

- గ్రామీణ ప్రాంతాల్లో దుర్వాసన.. పారిశుద్ధ్యంపై ప్రశ్నలు
- హస్నాబాద్ నుంచి బచ్చోడు వరకు అధికారుల నిఘా అవసరం





**తిరుమలాయపాలెం, ప్రజాజ్యోతి సెప్టెంబర్ 4:** గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని హస్నాబాద్, బచ్చోడు, సుబ్బలేడు, రఘునాథపాలెం, జుపేద, కాకరవాయి తదితర గ్రామాల పరిధిలోని కొన్ని రహదారుల పక్కన చికెన్ వ్యర్థాలు కనిపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు.

**ఈకలు.. మాంసపు అవశేషాలు.. దుర్వాసన**

చికెన్ దుకాణాల నుంచి వెలువడే ఈకలు, మాంసపు అవశేషాలు, ఇతర వ్యర్థాలను కొన్ని ప్రాంతాల్లో బహిరంగంగా పడేస్తున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో దుర్వాసన వస్తోందని, రోడ్ల వెంట ప్రయాణించే వారు, సమీప నివాసితులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.

**చెత్త కుప్పల్లో మాంసపు వ్యర్థాలు?**

సాధారణ చెత్తతో పాటు మాంసపు వ్యర్థాలు కూడా కలిసిపోవడం వల్ల పారిశుద్ధ్య సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యర్థాలపై ఈగలు, ఇతర కీటకాలు చేరుతున్నాయని, వాటిని వెంటనే తొలగించాలని కోరుతున్నారు.

**అధికారుల తనిఖీలు ఎక్కడ.?**

మండలంలోని చికెన్ దుకాణాల వద్ద వ్యర్థాల నిర్వహణపై సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు. దుకాణాల నుంచి వెలువడుతున్న వ్యర్థాలను నిబంధనల ప్రకారం సేకరిస్తున్నారా? బహిరంగ ప్రదేశాల్లో పడేస్తున్నారా? అనే అంశాలపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కోరుతున్నారు.

**పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి**

గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల పక్కన వ్యర్థాలు పేరుకుపోకుండా గ్రామపంచాయతీ అధికారులు పర్యవేక్షణ పెంచాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికే వ్యర్థాలు పేరుకుపోయిన ప్రాంతాలను గుర్తించి శుభ్రం చేయడంతో పాటు, బహిరంగంగా వ్యర్థాలు పడేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు స్పందించి, హస్నాబాద్ నుంచి కాకరవాయి వరకు పారిశుద్ధ్య పరిస్థితులపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# తిరుమలాయపాలెంలో సోషల్ మీడియా రాజకీయ వేడి

(మొదటి పేజీ తరువాయి...)

ప్రశ్నలు సంధిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

**పోస్టు పెట్టగానే.. కౌంటర్ రెడీ!**

మండలంలోని పలువురు రాజకీయ అభిమానులు సోషల్ మీడియాను ఆసక్తిగా గమనిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. ఒక పార్టీకి చెందిన నాయకుడు లేదా కార్యకర్త ఏదైనా రాజకీయ అంశంపై పోస్టు చేస్తే.. దానికి ప్రత్యర్థి వర్గం నుంచి స్పందన రావడం, ఆ తర్వాత మళ్లీ మరో కౌంటర్ రావడం సాధారణంగా మారిందన్న చర్చ వినిపిస్తోంది. దీంతో గ్రామాల్లోని టీ దుకాణాలు, కూడళ్లు, రాజకీయ సమావేశాల్లో కూడా సోషల్ మీడియా పోస్టుల పైనే చర్చ జరుగుతోందని పలువురు అంటున్నారు.

**విమర్శలు ఓకే.. వ్యక్తిగత దూషణలు వద్దు!**

రాజకీయ పార్టీల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలు ప్రజాస్వామ్యంలో సహజమే. అయితే అభిప్రాయ భేదాలు విధానాలు, ప్రజా సమస్యలపైనే ఉండాలని స్థానికంగా కొందరు అభిప్రాయపడుతున్నారు. రైతుల సమస్యలు, గ్రామీణ రహదారులు, తాగునీరు, డ్రైనేజీ, విద్య, వైద్యం, యువతకు ఉపాధి వంటి స్థానిక సమస్యలపై రాజకీయ పార్టీలు సోషల్ మీడియా వేదికగా చర్చిస్తే ప్రజలకు మరింత ప్రయోజనం ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు.

**సోషల్ మీడియా పోరు.. ప్రజా సమస్యలపైకి మళ్లుతుందా?**

తిరుమలాయపాలెం మండలంలో బీఆర్ఎస్–కాంగ్రెస్ మధ్య రాజకీయ పోటీ కొత్త విషయం కాకపోయినా.. సోషల్ మీడియా విస్తరణతో విమర్శలు, ప్రతి విమర్శలు మరింత వేగంగా ప్రజల్లోకి వెళ్తున్నాయి.

**రోజుకో పోస్టు.. గంటకో కౌంటర్..**

ఇలా సాగుతున్న రాజకీయ సోషల్ మీడియా పోరు చివరకు ఏ దిశకు వెళ్తుందన్నది ఇప్పుడు మండలంలో చర్చగా మారింది. రాజకీయ పార్టీలు ఒకరినొకరు విమర్శించుకోవడం కంటే.. "మండలానికి ఏం చేశాం? ఇక ఏం చేయబోతున్నాం?" అనే అంశాలపై పోటీ పడితే ప్రజలకు మరింత మేలు జరుగుతుందనే అభిప్రాయం స్థానికంగా వినిపిస్తోంది.

**విమర్శలు ఉండాలి.. ప్రతి విమర్శ ఉండాలి..**

కానీ చివరికి గెలవాల్సింది రాజకీయ పార్టీ కాదు — ప్రజా సమస్యలే!

# 333% పెరిగిన విద్యార్థుల నమోదు

(మొదటి పేజీ తరువాయి...)

కృషి, గ్రామస్తుల సహకారం, అధికారుల ప్రోత్సాహంతో ప్రాథమిక పాఠశాల జక్కేపల్లి ఎస్సీ కాలనీ సాధించిన విజయ గాథ ఇది.. ముగ్గురు విద్యార్థులతో 2025-26 విద్యాసరాంతానికి అవసాన దశకు చేరుకుంది. మండలంలోని మ్.పీ.పీ.ఎస్. జక్కేపల్లి ఎస్సీ కాలనీ ఇక మూత పడ్డట్టే అని అందరూ భావించారు. కానీ ఇక్కడే అద్భుతం జరిగింది. ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి పాఠశాల పునరుద్ధరణ పై ప్రత్యేక దృష్టి సారించారు. ఎలాగైనా పాఠశాలలను నిలబెట్టాలని కంకణం కట్టుకున్నారు..

**బడిబాట కార్యక్రమంలో.**

తెలంగాణ ప్రభుత్వం వారు బడిబాట కార్యక్రమానికి షెడ్యూల్ నిర్ణయించారు, నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఉపాధ్యాయులు తల్లిదండ్రులను గ్రామస్తులను కలిసి విద్యార్థుల నమోదును పెంచేందుకు కృషి చేయాల్సిందిగా ఆదేశించారు. ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి ఈ విషయాన్ని మరింత సీరియస్ గా పరిగణించి. తల్లిదండ్రులు ఇళ్ల వద్ద అందుబాటులో ఉండే సమయాల్లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు, కేవలం నిర్దేశించిన షెడ్యూల్లో నే కాక అంతకుమించి తల్లిదండ్రులను



ఒప్పించేందుకు ప్రయత్నం చేశారు. తన ప్రయత్నాలు నేడు ప్రతిఫలాలుగా కళ్ళ ముందు నిలుస్తున్నాయి..

**333% పెరిగిన నమోదు.**

విద్యార్థుల సంఖ్యను పెంచాలనే కృత నిశ్చయంతో, ప్రైవేటు పాఠశాలలకు విద్యార్థులను పంపే తల్లిదండ్రులను పేరుపేరునా కలవడం జరిగింది. ప్రభుత్వ పాఠశాల కల్పిస్తున్న వసతులు, మధ్యాహ్న భోజనం, నూతన వస్త్రాలు, పాఠ్యపుస్తకాలు, నోటి పుస్తకాలు, నిష్ణాతులైన ఉపాధ్యాయులచే బోధన ఇత్యాది విషయాలను స్పష్టంగా తల్లిదండ్రుల వద్దకు తీసుకెళ్లగలిగారు. ఫలితంగా ముగ్గురు విద్యార్థులతో అవసాన దశలో ఉన్న పాఠశాలలో 15 మంది నూతనంగా అడ్మిషన్లు తీసుకున్నారు. 2026-27 విద్యా సంవత్సరంలో జిల్లాలోనే మేటిగా నిలిచింది ఈ పాఠశాలమరో ఉపాధ్యాయులు అందుబాటులోకి. విద్యార్థుల సంఖ్య పెరగడంతో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ పాఠశాలకు మరో ఉపాధ్యాయుని కేటాయించారు. ఇటు విద్యార్థుల తల్లిదండ్రులు అటు ఉపాధ్యాయులు ఈ విషయం పట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న విద్యా సంవత్సరంలో మరింత మంది విద్యార్థులను నమోదు చేసి, నాణ్యమైన విద్యను అందించడంలో జిల్లాలోనే ఉన్నత స్థానంలో నిలవాలని ఆకాంక్ష పెరిగిపోయింది.

**ఇది సమిష్టి కృషి.**

**ఉమాదేవి ప్రధానోపాధ్యాయులు**

మూతపడే దశకు చేరుకున్న జక్కేపల్లి ప్రభుత్వ పాఠశాల తిరిగి పూర్వ యోగం దక్కించుకుంది. అంతేకాదు 333% నమోదు రేటుతో జిల్లాలోనే మేటిగా నిలిచింది. ఇది సమిష్టి కృషి వలన వచ్చిన ఫలితం . ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలు సౌకర్యాల విషయం తల్లిదండ్రులకు స్పష్టంగా చేరవేయడం, నాణ్యమైన విద్యను అందజేస్తామని భరోసాను కల్పించడం, వీటన్నింటికీ తోడు గ్రామస్తులు యువత నుంచి అందిన సహకారం అధికారులు అందించిన తోడ్పాటు వలననే ఈ ఫలితం సాధ్యమైంది.

**@ ప్రధానోపాధ్యాయురాలు కృషి అభినందనీయం. లక్ష్మయ్య గ్రామ సర్పంచ్.**

ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి గారు విద్యార్థుల సంఖ్యను పెంచడంలో చాలా శ్రమించారు. వారి కృషి అభినందనీయం. ముగ్గురు విద్యార్థులతో మూతపడే స్థితిలో ఉన్న పాఠశాలను 15 విద్యార్థులకు పెంచి పాఠశాలలను బతికించారు. నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రధానోపాధ్యాయులు నిరంతర కృషి చేస్తూ ఉంటారు. మండుటెండలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థుల సంఖ్యలను పెంచడంలో ఆవిడ పడిన తపన చాలా గొప్పది.

## శ్రీకృష్ణ శతక పద్యాల పోటీలలో సత్తా చాటిన

# శ్రీ భాస్కర్ మెమోరియల్ స్కూల్ విద్యార్థులు

**ఎర్రుపాలెం ప్రజాజ్యోతి** శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం మధిర, సుమిత్ర యూత్ వారి ఆధ్వర్యంలో శ్రీ రామాలయ ప్రాంగణంలో నిర్వహించిన శ్రీకృష్ణ శతక పద్య పోటీల లో మండలానికి చెందిన మీనవోలు శ్రీ భాస్కర్ మెమోరియల్ స్కూల్ విద్యార్థులు అద్భుతమైన ప్రతిభను కనబరిచి అన్ని విభాగాల్లోనూ బహుమతులు కైవసం చేసుకున్నారు. సబ్-జూనియర్ విభాగంలోచింత హిరణ్య ప్రథమ బహుమతి జూనియర్ విభాగంలో ముక్కర పవిత్ర –ప్రథమ బహుమతి లోడుగు విష్ణు ప్రియ తృతీయ బహుమతి సీనియర్స్ విభాగంలో ప్రత్యేక కన్సోలేషన్ బహుమతులు శీలం సత్యనారాయణ రెడ్డి తోట గ్రీష్మ సాధించారు అత్యంత ప్రతిభతో బహుమతులు సాధించిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ భట్లపెనుమర్తి సూర్యనారాయణ , డైరెక్టర్ బి వెంకటేశ్వరావు , తెలుగు బోధకులు రావూరి గిరి బాబు మేరీ మరియు ఉపాధ్యాయులు అభినందించారు



# దోచుకోవటం దాచుకోవటమే రేవంత్ రెడ్డి పాలన

- జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా అభివృద్ధి శూన్యం.
- ఎమ్మెల్సీ తాత మధుసూదన్,ఆర్ జె సి కృష్ణ, బానోతు చంద్రావతి.





**కారేపల్లి, సెప్టెంబర్ 04, ప్రజా జ్యోతి:** దోస్కోటం దాచుకోవమె రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పాలన, జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా అభివృద్ధిలో శూన్యం, పోరాడి తెలంగాణ సాధించింది కేసీఆర్, నేడు తెలంగాణ వ్యతిరేకులు రాష్ట్రాన్ని పాలిస్తున్నారు అని ఖమ్మం జిల్లా టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ తాత మధుసూదన్, వైరా నియోజకవర్గ సర్ ఇంచార్జి ఆర్ జె సి కృష్ణ, మాజీ ఎమ్మెల్యే భానోత్ చంద్రావతులు అన్నారు. శుక్రవారం సింగరేణి మండల పరిధిలోని కారేపల్లి క్రాస్ రోడ్ లో మండల టిఆర్ఎస్ శ్రేణుల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నేటికీ వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా నిరసన తెలుపుతూ వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉన్నం వీరేందర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథులుగా వారు హాజరై మాట్లాడుతూ ప్రాణాలకు తెగించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన తెలంగాణ జాతిపిత కేసిఆర్, ప్రజలకు మాయ మాటలు చెప్పి వారిని మాయలో పడేసి అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి సర్కార్. ఎన్నికల ప్రచారంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి నెరవేర్చకుండా తెలంగాణ ప్రజలని మోసం చేసిందన్నారు. ఆనాడు ప్రజలు అడగకుండానే ఎన్నో సంక్షేమ, ప్రజా అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టిన ఘనత కేసీఆర్ ది.నేడు రేవంత్ రెడ్డి సర్కార్ ఎన్నికల టైంలో ప్రజలకు ఎన్నో ఆశలు పెట్టి ఈనాటికి అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన సర్కార్ కాంగ్రెస్ సర్కారని వారు విమర్శించారు. రాబోయేది తెలంగాణ రాష్ట్రంలో బిఆరెస్ సర్కారే అని వ్యక్తం చేశారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో రైతు, మహిళ,యువత, ఉద్యోగ వ్యతిరేక పరిపాలనడుస్తుంది, ప్రజాభివృద్ధి కంటే దోచుకోవటానికే ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తున్నారు, ఇచ్చిన హామీలను నెరవేర్చే ఆలోచన లేదు, వర్గపోరుతో రాష్ట్రంలో ఆధిపత్య పోరు నడుస్తుంది. ప్రజలు రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్తారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బానోత్ మనిషా లక్ష్మి, లకావత్ గిరిబాబు, పోట్ల శ్రీనివాసరావు, కట్టా కృష్ణార్జునరావు,బాణాల శ్రీనివాసరావు, వైరా మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ, మాజీ జడ్పిటిసిలు పొన్నం వీరేందర్,వాంకుడోత్ జగన్, జిల్లా నాయకులు ముత్యాల వెంకట అప్పారావు, డోంకేన రవీందర్, మాజీ సర్పంచ్ కుమార్, మాజీ ఎంపీటీసీ శంకర్,అజ్మీర రవి, శివరాత్రి అచ్చయ్య,సింగరేణి మండల టిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఇస్లావత్ బన్సీలాల్,తాత వెంకన్న, జరుపుల హచ్, సక్రు ఎస్కే గౌసిద్దీన్,నాగరాజు, వికాస్,రాజే ష్, మోహన్, జాల సాంబ, గంగారబోయిన మురళి, జడల కళ్యాణ్, టిఆర్ఎస్ నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# జనసేన సన్నాహాక సమావేశంను విజయవంతం చేయండి



**నేలకొండపల్లి, సెప్టెంబర్ 4 ప్రజా జ్యోతి :** పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి లో ఈనెల 6 న జరిగే ముఖ్య కార్యకర్తల సన్నాహాక సమావేశం ను విజయవంతం చేయాలని పార్టీ నాయకులు మామిడి ఉదయ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు..ఈ నెల 6 న వరంగల్–ఖమ్మం, నల్లగోండ పట్టభద్రుల ఎమ్మేల్సీ అభ్యర్థి గడల శ్రీనివాస్ వస్తున్నారని పేర్కోన్నారు. పాలేరు డివిజన్ లో పార్టీని బలోపేతం చేసేందుకు, ప్రజా సమస్యల పై భవిష్యత్ కార్యచరణ ను రూపొందించటం కోసం సమావేశం ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.' కావునా డివిజన్ నుంచి కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. స్థానిక విజయరామ పంక్షన్ హాల్ లో ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్నట్లు తెలిపారు.

# ఖమ్మం జిల్లా ఓబీసీ అధ్యక్ష పదవికి దరఖాస్తుల ఆహ్వానం



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఓబీసీ డిపార్ట మెంట్ అధ్యక్షులు,శాసనసభ సభ్యులు వీర్లపల్లి శంకర్ ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లా ఓబీసీ డిపార్ట్ మెంట్ జిల్లా అధ్యక్ష పదవి కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీసీసీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఒక ప్రకటన లో పేర్కొన్నారు.ఔత్సాహిక అభ్యర్థుల నుండి రేపు ఉదయం 11.00 గంటల నుండి సాయంత్రం 03.00 గంటల వరకు జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఓబీసీ పరిశీలకులు పెరుమాండ్ల చరణ్ గౌడ్ , జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ , జిల్లా ఓ బి సి డిపార్ట్మెంట్ అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం ల సమక్షంలో జరుగుతుందని తెలిపారు.కావున కాంగ్రెస్ పార్టీ భావజాలం కలిగి ఉండి, పార్టీ కొరకు నిబద్ధతతో పనిచేయాలనుకునే ఔత్సాహిక అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

# స్ఫూర్తిదాయక ఉపాధ్యాయుని జ్ఞాపకాల పలకరింపు

- రిటైర్డ్ సీనియర్ టీచర్ పురాణం శేషగిరి రావు శ్రీ భాస్కర మెమోరియల్ స్కూల్ , సందర్శన

**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** అది కేవలం ఒక పాఠశాల పర్యటన మాత్రమే కాదు… విద్యాకుసుమాలను వికసింపజేసిన ఒక మహావృక్షం, తరాల జ్ఞాపకాల వేదికపైకి తిరిగొచ్చిన అపూర్వ ఘట్టం! ఎంతోమంది శిష్యులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది, క్రమశిక్షణతో కూడిన విద్యకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన ఒకప్పటి తరం ఆంగ్ల ఉపాధ్యాయులు పురాణం శేషగిరిరావు (84) 'శ్రీ భాస్కర మెమోరియల్ స్కూల్'ను సందర్శించారు. 84 ఏళ్ల వయస్సులోనూ ఏమాత్రం చెక్కు చెదరనీ ఆనందోత్సాహంతో, తన అనుభవ జ్ఞానాన్ని నేటి తరానికి అందించేందుకు విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు విద్య అనేది కేవలం పుస్తకాలకే పరిమితం కాదని, అది వ్యక్తిత్వ వికాసానికి, కర్తవ్య నిర్వహణకు పునాది కావాలని పిలుపునిచ్చారు. అలాగే ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ, "బోధన అనేది ఉద్యోగం కాదు, భావితరాలను నడిపించే పవిత్రమైన బాధ్యత" అని నొక్కిచెప్పారు.చాలా సంవత్సరాల తర్వాత మళ్లీ పిల్లల తో, ఉపాధ్యాయుల ఆత్మీయతల మధ్య తన అనుభవ సారాన్ని పంచుకుంటున్న ఆ క్షణాల్లో శేషగిరిరావు ఒక రకమైన తన్మ యత్వానికి ఆనందోద్వేగానికి లోనయ్యారు. ఈ అద్భుత ఘట్టంపై పాఠశాల కరస్పాండెంట్ బి. సూర్యనారాయణ మరియు డైరెక్టర్ శ్రీ బి. వెంకటేశ్వర రావు అత్యంత హర్షం వ్యక్తం చేశారు. తమ పాఠశాలకు ఒక మహోన్నత గురువు రావడం, ఆయన అమూల్యమైన ఆశీస్సులు లభించడం తమకు దక్కిన గొప్ప గౌరవమని పేర్కొన్నారు. ఆయన అందించిన స్ఫూర్తితో పాఠశాలను మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు.



# పదేళ్లలో కేసీఆర్ ఏం చేసిండని కాంగ్రెస్ ను విమర్శిస్తున్నారు

- బీఆర్ఎస్ ను మరిచిపోతున్నారనే నిరసన కార్యక్రమాలు
- ఉద్యమకారులను పట్టించుకోని కేసీఆర్ కు మాట్లాడే అర్వత లేదు
- అధికార దాహంతోనే కాంగ్రెస్ పై విమర్శలు
- ప్రజలు గమనిస్తున్నారు. టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్రావు



**నేలకొండపల్లి, సెప్టెంబర్ 4 ప్రజాజ్యోతి :** పదేళ్ల లో కేసీఆర్ ప్రభుత్వం ఏం చేసిందని...కాంగ్రెస్ ను విమర్శిస్తున్నారో అర్థం కావటం లేదని...తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్రావు అన్నారు. మండలంలోని కొత్తకొత్తూరు గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు… పదేళ్ల రాష్ట్రం ను పాలించి అప్పులు . పాలు చేసిండన్నారు. ఆ అప్పులకు కాంగ్రెస్ వడ్డీలకు వడ్డీలు చెల్లిస్తూనే… సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ను విమర్శించే నెతిక హక్కు ఏ బీఆర్ఎస్. నాయకులకు లేదన్నారు. కాంగ్రెస్ 1000 రోజుల పాలన పై నిరసన కార్యక్రమాలు కావవి...బీఆర్ఎస్ ను ప్రజలు మరిచిపోతున్నారని అందుకే రోడ్ల పైకి వచ్చారన్నారు. దేశంలోనే అధికారం చేపడతామన్నా కేసీఆర్ ఫామ్ హౌజ్ కు పరిమితమయ్యారన్నారు. రేవంత్ రెడ్డి హాయంలో ఇరిగేషన్ ను పరుగులు పెట్టిస్తున్నారని పేర్కోన్నారు. ఉద్యమకారుల వలన వచ్చిన తెలంగాణ ను అనుభవించి, ఉద్యమకారులను విస్మరించిన బీఆర్ఎస్ కు మాట్లాడే అర్హత లేదన్నారు. ప్రజా సమస్యలు ఉన్నప్పుడు అసెంబ్లీకి వచ్చి… కేసీఆర్ ప్రశ్నించాలని స్వయంగా సీఎం చెబుతున్నా రాకపోవటం బాధకరమన్నారు. పదేళ్లలో కేసీఆర్ ఇచ్చిన హమీలు ఎన్ని..ఎన్ని అమలు చేసిండో ప్రజలకు వివరించాలన్నారు. బీఆర్ఎస్ గురివింద సామెత మాదిరిగా వ్యవహరిస్తుందన్నారు. వారి నిరసన వలన ఏ మాత్రం ప్రయోజనం లేదన్నారు. అధికారం దాహంతో చేసే విమర్శలు మానుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ చేసిన అప్పుల వలన రాష్ట్ర ఆర్థిక పరిస్థితి' బాగలేకున్నా. సంక్షేమం ను ఆపటం లేదన్నారు. అందుకు రేవంత్రెడ్డి ప్రభుత్వం కు మా సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. త్వరలోనే తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం తీపి కబురు చెబుతుందన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు మాధాసు శ్రీనివాసరావు, మండలాధ్యక్షుడు మందడి వెంకటేశ్వర్లు ఉన్నారు.

# శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో ఉట్టి కొట్టిన బాలిన సతీష్‌బాబు

**నేలకొండపల్లి, సెప్టెంబర్ 4 ప్రజా జ్యోతి:** మండలంలోని భైరవునిపల్లిలో శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని యాదవ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దగొల్ల బాలిన చిన్న నారాయణ కుమారుడు బాలిన సతీష్‌బాబు శ్రీకృష్ణుడి వేషధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో సతీష్‌బాబు శ్రీకృష్ణుడి వేషధారణలో ఉత్సాహంగా పాల్గొని ఉట్టిని కొట్టి అందరినీ అలరించారు. ఈ సందర్భంగా మల్లెబోయిన సైదులు తాడును గుంజుతూ పాటలు పాడి ప్రజలను ఉత్సాహపరిచారు. పాటలు, ఆటలు, ఉట్టి కొట్టే కార్యక్రమంతో భైరవునిపల్లిలో పండుగ వాతావరణం నెలకొంది.శ్రీకృష్ణుడి బాల్యలీలలను గుర్తుచేసేలా నిర్వహించిన ఈ వేడుకలను చిన్నారులు, యువత, గ్రామస్తులు ఆసక్తిగా తిలకించారు. సంప్రదాయాలను కొనసాగిస్తూ శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కనకబండి సీతారాములు, మాజీ ఎంపిటిసి నూక చిన్న నాగయ్య, యాదవ్ సంఘం నాయకులు కనకబండి రమేష్,మల్లెబోయిన శ్రీనివాస్ రావు,పొదిల లక్ష్మయ్య, మల్లెబోయిన వేంకటేశ్వరరావు,బుర్ర నాగభూషణం, కనకబండి రామయ్య,మల్లెబోయిన గోవిందరావు,బాలిన కోటేశ్వర రావు, నూక వేంకటేశ్వరరావు, చల్లా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# మధిర నియోజకవర్గ ప్రజలు నాలుగు సార్లు భట్టి విక్రమార్క మల్లుని అత్యంత మెజార్టీతో గెలిపించారు

- నాలుగుసార్లు మా నాయకుడి చేతిలో చావు దెబ్బతిన్న ఇంకా బుద్ధిరాని కమల్ రాజ్
- జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి.



**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు అయిన సందర్భంగా తెలంగాణ ప్రజా ప్రభుత్వం పిలుపుమేరకు రాష్ట్రంలో పేదవాడు, రైతులు, మహిళలు ఆత్మగౌరవంతో సంబరాలు చేస్తుంటే చూసి ఓర్వలేని ఈ టీఆర్ఎస్ ప్రభుత్వం అబద్దాలను ప్రచారం చేసుకుంటూ గ్రామాల్లో నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాలు చేస్తున్న కమల్ రాజు వ్యాఖ్యలపై జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ నియోజకవర్గానికి గత పది సంవత్సరాల్లో టిఆర్ఎస్ ప్రభుత్వం ఏమి చేసింది ఒకసారి ఆత్మ పరిశీలన చేసుకొని మాట్లాడు?ఈ నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తూ, ఈ రాష్ట్రంలో పేదవాడు ఆత్మగౌరవంతో బతకాలని ప్రతి మహిళ కోటీశ్వరులుగా చూడాలని ప్రతి బిడ్డ మంచి చదువులు చదువుకోవాలని ఉన్నత స్థానాల్లో ఉండాలని మా నాయకుడు భట్టి విక్రమార్క అహర్నిశలు కృషి చేస్తూ ఎంతో కష్టపడుతూ ఈ నియోజకవర్గాన్ని దేశంలోనే మోడల్ నియోజకవర్గంగా ఉంచాలని కృషి చేస్తున్న మా ప్రజా ప్రభుత్వం పై మా నాయకుడు భట్టి విక్రమార్క పై విమర్శలు చేస్తున్న కమల్ రాజ్ ఆత్మ పరిశీలన చేసుకుని మాట్లాడగలరు. పేదవాడు ఆత్మగౌరవంతో ఐదు లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తే చాలా సంతోషంగా ఈ రాష్ట్రంలో సంబరాలు నిర్వహిస్తుంటే అలాగే ప్రతి మహిళ ఆత్మగౌరవంతో బతకాలని ప్రతి మహిళను కోటీశ్వరులుగా చేయడమే లక్ష్యంతో ఈ ప్రభుత్వం చేస్తున్న అనేక మహిళా సంక్షేమ కార్యక్రమాలు ఉచిత బస్సు, ఇందిరా డైరీ, సోలార్ విద్యుత్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు, బస్సులకు ఓనర్లు మహిళలను చేసిన ఈ ప్రభుత్వంపై అబద్ధాలు చెబుతున్న కమల్ రాజు గత పది సంవత్సరాల్లో మీ ప్రభుత్వం ఏం చేసింది. అని మాట్లాడుతున్నావ్పేదవాడు ఆత్మగౌరంతో బతకాలని సన్న బియ్యం పథకం పెట్టి పేదవాడి ఆకలి తీర్చిన గొప్ప నాయకుడు రేవంత్ రెడ్డి అమ్మ ఫౌండేషన్ పేరుతో ఎన్నో పేదలకు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్న అమ్మ ఫౌండేషన్ చైర్మన్ నందిని విక్రమార్క పై తప్పుడు ప్రచారాలు చేస్తున్న కమల్ రాజు నోరు అదుపులో పెట్టుకోప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత కరెంటు ఇస్తూ పేదవాడి ఆత్మగౌరవంతో ఉండేలా చేసిన ఈ ప్రజా ప్రభుత్వం పై విమర్శలు చేయడం సరి అయిన పద్ధతి కాదు, ఈ ఎర్రుపాలెం మండలానికి ప్రతి ఎకరాకి నీరు అందించే ఉద్దేశంతో జవహర్ ఎత్తిపోతల పథకాన్ని 630 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న అపర భగీరథుడు మా భట్టి విక్రమార్క మల్లు ఈ నియోజకవర్గంలో ప్రతి డొంక రోడ్డు, ప్రతి లింకు రోడ్డు వేయించిన గొప్ప నాయకుడు మా విక్రమార్కుడుమహిళలను ఆత్మగౌరవంతో బతకాలని ఎన్నో మహిళా సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్న ఈ ప్రజా ప్రభుత్వం పై ఇలా తప్పుడు ప్రచారాలు చేస్తున్న కమల్ రాజు ఇకనైనా తమ పద్ధతి మార్చుకోగలరు. ఈ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టి కోట్ల రూపాయలు కెసిఆర్ కుటుంబ సభ్యులు దోచుకుని రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టివేశారు అటువంటి అప్పుల నుండి ఈ రాష్ట్రాన్ని ఉపముఖ్యమంత్రిగా, ఆర్థిక మంత్రిగా గాడిలో పెట్టి అభివృద్ధిని సంక్షేమాన్ని చేసుకుంటూ ముందుకు తీసుకెళ్తున్న మా ప్రజా ప్రభుత్వం పై మా నాయకుడు భట్టి విక్రమార్క మల్లు పై ఇలా తప్పుడు ప్రచారాలు, అబద్ధపు మాటలు మానుకోగలవు. ప్రజా ప్రభుత్వాన్ని, మా నాయకుడు భట్టి విక్రమార్క మల్లు చేస్తున్న అభివృద్ధికి, సంక్షేమానికి ఈ నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి ఒక ప్రకటనలో అన్నారు.

## గార్లపాడులో కృష్ణాష్టమి వేడుకలు

- పల్లకి సేవలో పాల్గొన్న భక్తులు



**బోనకల్, సెప్టెంబర్ 4(ప్రజా జ్యోతి):** మండల పరిధిలోని గార్లపాడు గ్రామంలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి విశేష అలంకరణ చేశారు. కృష్ణాష్టమి సందర్భంగా నిర్వహించిన పల్లకి సేవ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. స్వామివారిని పల్లకిలో కొలువుదీర్చి ఆలయ పరిసరాల్లో పల్లకి సేవ నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పల్లకి సేవలో భక్తుల నామస్మరణలు, భజనలు మార్మోగాయి. ఉదయం నుంచే గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి శ్రీ వేణుగోపాల స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. దీంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది.కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కార్యక్రమాలను సజావుగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులయ్యారు.

## దళిత రత్న అవార్డు గ్రహీత వీరన్నకు ఘన సన్మానం



**కారేపల్లి సెప్టెంబర్ 04, ప్రజా జ్యోతి :**బహుజన స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దళిత రత్న అవార్డు గ్రహీత మెట్టు వీరన్న కు శుక్రవారం ఘన సన్మానం నిర్వహించారు. సింగరేణి మండల కేంద్రమైన కారేపల్లి లో బిఎస్ఎఫ్ఐ నాయకులు ఆయనను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. బిఎస్ఎఫ్ఐ ఖమ్మం జిల్లా అధ్యక్షులు దాసరి రాజశేఖర్ మాట్లాడుతూ, సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తున్న వ్యక్తులను గుర్తించి గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, విద్య, హక్కుల కోసం కృషి చేస్తున్న మెట్టు వీరన్నకి దళిత రత్న అవార్డు రావడం గర్వకారణమని పేర్కొన్నారు.యువత, విద్యార్థులు మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వంటి మహనీయుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని దాసరి రాజశేఖర్ పిలుపునిచ్చారు. సామాజిక సేవా రంగంలో ముందుండే వారిని ప్రోత్సహించడం ద్వారా మరింత మంది యువత సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఎస్ఎఫ్ఐ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ గద్దెల నాగరాజు, బిఎస్ఎఫ్ఐ ఖమ్మం జిల్లా సెక్రెటరీ చిలుముల అజయ్, నాయకులు వివేక్, సందీప్, నాగుల్, మీరా తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



**కారేపల్లి, సెప్టెంబర్ 04, ప్రజాజ్యోతి :** సింగరేణి మండలం లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నపిల్లలు భక్తిశ్రద్ధలతో శ్రీ కృష్ణుడు, రాధ, గోపికల తదితర వేషధారణలతో సందడి చేశారు. ఇండ్లలో చిన్నారి పాదాలతో కృష్ణుడికి ఆహ్వానం పలికారు.వేడుకల్లో భాగంగా ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని సింగరేణి మండల కేంద్రమైన కారేపల్లి లో, గేటు గారేపల్లిలో, మండల పరిధిలోని వివిధ గ్రామాలలో యువత ఉత్సాహంగా నిర్వహించారు. యువతి యువకులు ఎంతో ఆనందంగా ఉట్టి కొట్టే కార్యక్రమం లో పాల్గొని సందడి చేశారు.పలువురు మాట్లాడుతూ కృష్ణాష్టమి వంటి పం డుగల ద్వారా మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, విలువలను తెలుసుకోవటం ఎంతో ముఖ్యమని, విద్యార్థులు, యువత పుస్తక జ్ఞానంతో పాటు సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంచుకోవాలని" అన్నారు.అలాగే శ్రీకృష్ణుడి జీవితం అనేక మంచి సందేశాలను అందిస్తుందని, శ్రీకృష్ణుడి సత్యం, ధర్మం, ధైర్యం, మంచి పనులు చేయాలనే గుణాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

## కాకరవాయి గ్రామంలో ఘనంగా కాకనదుర్గమ్మ ఉత్సవాలు

- సర్పంచ్ గూడూరు ఉమ ఉపేందర్ ఆధ్వర్యంలో వైభవంగా వేడుకలు





**తిరుమలాయపాలెం, సెప్టెంబరు 04 ప్రజాజ్యోతి :**మండలం లోని కాకరవాయి గ్రామంలో కాకనదుర్గమ్మ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ "గూడూరు ఉమ ఉపేందర్"ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాలకు గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించడంతో పాటు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి.గ్రామ ప్రజలంతా ఐక్యంగా పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయడం పట్ల సర్పంచ్ గూడూరు ఉమ ఉపేందర్ సంతోషం వ్యక్తం చేశారు. గ్రామ ప్రజలకు అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

## కనకదుర్గమ్మ ఉత్సవాల్లో కట్కూరి శ్రీనివాసరెడ్డి

- గ్రామ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్న కాంగ్రెస్ నాయకుడు





**తిరుమలాయపాలెం, ప్రజా జ్యోతి, సెప్టెంబర్ 4:**కాకరవాయి గ్రామంలో వైభవంగా కొనసాగుతున్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఉత్సవాల్లో కాంగ్రెస్ నాయకుడు కట్కూరి శ్రీనివాసరెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, గ్రామంలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని ప్రార్థించారు.ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఏడాది కనకదుర్గమ్మ ఉత్సవాలను గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అమ్మవారి ఉత్సవాలు గ్రామ ప్రజల మధ్య ఐక్యతను, ఆధ్యాత్మిక భావనను మరింత పెంపొందిస్తాయని పేర్కొన్నారు. కనకదుర్గమ్మ అమ్మవారి ఆశీస్సులతో గ్రామంలో ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు.ఉత్సవాల్లో భాగంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా కనకదుర్గమ్మ పండుగ

- భక్తిశ్రద్ధలతో అమ్మ వారికి ప్రత్యేక పూజలు.. దర్శనానికి పోటెత్తిన భక్తజనం
- పద్మశాలీల నేత చీర సమర్పణ ప్రత్యేక ఆకర్షణ
- పండుగ ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించిన సర్పంచ్ గూడూరు ఉపేందర్
- సాంప్రదాయబద్ధంగా ఉత్సవాలను నిర్వహించిన ఆలయ ధర్మకర్త లక్కరాజు ప్రసాదరావు



**తిరుమలాయపాలెం, ప్రజా జ్యోతి** తిరుమలాయపాలెం మండలం కాకరవాయి గ్రామంలో కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి పండుగను గ్రామ ప్రజలు అంగరంగ వైభవంగా, అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా గ్రామ ప్రజలు ఎంతో భక్తితో, సాంప్రదాయబద్ధంగా నిర్వహించే ఈ పండుగకు ఈ ఏడాది కూడా పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే ఆలయానికి భక్తుల రాక ప్రారంభం కావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసి పోయాయి. భక్తులు బారులు తీరి కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు.కనకదుర్గమ్మ పండుగలో భాగంగా ఆలయం చుట్టూ సుమారు 200కు పైగా ఎడ్లబండ్లు దక్షిణాలు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సాంప్రదాయ పద్ధతిలో భక్తులు ఎడ్లబండ్లతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ అమ్మవారికి మొక్కులు చెల్లించారు. పెద్ద సంఖ్యలో ఎడ్లబండ్లు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. ఈ సాంప్రదాయాన్ని తిలకించేందుకు గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.ఇక పండుగలో పద్మశాలీల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. పద్మశాలీలు ప్రత్యేకంగా నేసిన నేత చీరను తీసుకుని అమ్మవారి చుట్టూ మూడు ప్రదక్షిణలు చేసి, అనంతరం ఆ నేత చీరను కనకదుర్గమ్మ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో సమర్పించారు. అమ్మవారికి నేత చీర సమర్పించే ఈ సాంప్రదాయ కార్యక్రమం పండుగలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తమ వృత్తి సంప్రదాయానికి ప్రతీకగా నేత చీరను అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకోవడం పట్ల పద్మశాలీలు భక్తి, ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని భక్తులు ఆసక్తిగా తిలకించారు.కనకదుర్గమ్మ తల్లి కటాక్షంతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, రైతుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. గ్రామంలో సుఖశాంతులు నెలకొని ప్రతి కుటుంబం సంతోషంగా ఉండాలని ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామంలో పాడిపంటలు సమృద్ధిగా పండి ప్రజల జీవనోపాధులు మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.కులమతాలకు అతీతంగా గ్రామ ప్రజలంతా ఒక్కటై కనకదుర్గమ్మ పండుగను ఘనంగా నిర్వహించడం గ్రామ ఐక్యతకు నిదర్శనంగా నిలిచింది. భక్తుల రాకతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోగా, అమ్మవారి నామస్మరణతో కాకరవాయి గ్రామం మార్మోగింది. ఎడ్లబండ్ల దక్షిణాలు, పద్మశాలీల నేత చీర సమర్పణ, ప్రత్యేక పూజలు, భక్తుల మొక్కులతో పండుగకు మరింత శోభ చేకూరింది. భక్తి, సాంప్రదాయం, ఐక్యతల సమ్మేళనంగా కాకరవాయిలో కనకదుర్గమ్మ పండుగ అంగరంగ వైభవంగా ఘనంగా జరిగింది.

## గంగారం యుగకర్త మన మధుబాబు

- ఎమ్మెల్యే రాగమయి
- గౌడ కమ్యూనిటీ హాల్,శ్రీకృష్ణ మందిరం హాల్ ప్రారంభించిన ఎమ్మెల్యే
- ప్రజల శ్రేయస్సు కోరే ప్రజల అభిమాని మధుబాబు





**సత్తుపల్లి సెప్టెంబర్04(ప్రజా జ్యోతి)**గంగారం గ్రామపంచాయతీకి యుగకర్తగా మాజీ వైస్ ఎంపీపీ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, గ్రామ అభివృద్ధి ప్రదాత వెంకట్రామిరెడ్డి(చిట్టి నాయన) రాజకుమారిల కుమారుడు దాసరి మధుమోహన్ రెడ్డి (మధుబాబు) అని సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. శుక్రవారం మధుబాబు తన సొంత నిధులతో లక్షలు వెచ్చించి గౌడ కమ్యూనిటీ హాల్ ని నిర్మించారు. అదేవిధంగా శ్రీకృష్ణ మందిరం దగ్గర కళ్యాణం చేసుకునేందుకు భవన నిర్మాణాన్ని ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమాలను ప్రారంభించేందుకు ఆమె గంగారం గ్రామం చేరుకొని, అక్కడ నుండి సర్దార్ సర్వాయ్ పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసినారు. అనంతరం నిర్మాణానికి సిద్ధంగా వాటిని ప్రారంభించారు. శ్రీకృష్ణ మందిరంలో పూజలు చేసి, భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గంగారానికి యువకర్తగా మధుబాబు ఉన్నారని, ప్రజలకు ఏమేమి అవసరాలు ఉన్నాయో గుర్తించి, అభివృద్ధి చేస్తున్నారని ఇలాంటి వ్యక్తులు అరుదుగా సమాజంలో ఉంటారని, వీరిని ఉపయోగించుకొని గంగారాన్ని అభివృద్ధి బాటలో తీర్చిదిద్దుకోవాలని ప్రజలకు తెలియజేశారు. గంగారం తరపున ఏమి కావాలన్నా అభివృద్ధిలో నేను ముందు ఉంటానని,ప్రతి పనికి తోడ్పాటుగా సేవలు అందిస్తానని తెలియజేశారు. ప్రజల అవసరాల కోసం కరెంట్ పోల్స్, లైటింగ్, ఇంటిగ్రేటెడ్ ఆఫీస్, డ్రైనేజీ, సిసి రోడ్లు, పరిశుభ్రతకు తీర్చిదిద్దటం, మంచినీటికి ఇబ్బంది లేకుండా చూడటం, బోర్లు వేపించటం అనేక విషయాల్లో తనదైన శైలిలో అభివృద్ధి చేశారని దానికి నిదర్శనంగా,ఆదర్శంగా ఆయన పనులు ఉన్నాయని కొనియాడారు. సమాజంలో కోట్ల కోట్లు డబ్బులు ఉంటాయి కానీ,ఖర్చు పెట్టడానికి, దానం చేయడానికి ఎట్టి పరిస్థితుల్లో ముందుకు రారని, గంగారం అంటేనే ఎవరికైనా గుర్తొచ్చేది దాసరి కుటుంబం అని,ఆ కుటుంబం అంటేనే పేద ప్రజల కుటుంబమని, ప్రజల కోసం పాటుపడేవారు అని గతంలోవారు చేసిన కార్యక్రమాలను తెలియజేశారు. ముందు ముందు కూడా ఇంకా మంచి అభివృద్ధి చేయాలని, ఆయనను ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లు కాకర్ల రేవతి, ఒంటెద్దు వెంకటమ్మ సాయిలు, ఉప సర్పంచ్ బెజవాడ రాధా, గంగారం గ్రామ శాఖ అధ్యక్షుడు కావేటి అప్పారావు, కోలగట్ల చెన్నారావు, బెజవాడ శ్రీనివాసరావు,బండారు మారేశ్వర రావు,కరాటే రమేష్, యామాల ముత్యాలరావు, కాకర్ల మాణిక్యాలరావు, జల్లిపల్లి వాసుదేవరావు, కోటమర్తి జవహర్లాల్,చిన్ని, వెంకటేశ్వరరావు,కాలసాని నాగేశ్వరరావు,రాచమల్ల నాగేంద్రరావు,బండారి జగదీష్, కొవ్వారపు కన్నయ్య,ఎస్కే సుభాని,కోవారపు గిరిబాబు, చల్లారి సత్యనారాయణ, కొండపల్లి మహేష్,బెజవాడ మనోజ్,మొగిలిచర్ల సత్యనారాయణ, కాంగ్రెస్ అభిమానులు, మధు బాబు యువసేన సభ్యులు ఉన్నారు.





## మండలంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు





**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా గ్రామాల్లోని ఆలయాలను విద్యుత్ దీపాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించారు.ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పలు గ్రామాల్లో మహిళలు, యువత, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని భజనలు, కీర్తనలు నిర్వహించారు.కృష్ణాష్టమి సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో ముస్తాబై అందరినీ ఆకట్టుకున్నారు. కొన్ని గ్రామాల్లో ఉట్టి కొట్టే కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంతో పండుగ సందడి నెలకొంది. ఆలయాల వద్ద భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.పలు గ్రామాల్లో జరిగిన కృష్ణాష్టమి వేడుకలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, ప్రజలు భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకున్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- రాయుడు పాలెం శివారు ప్రాంతంలో ఇద్దరు పట్టివేత, ఆరుగురు పరారీ



**వేంసూరు సెప్టెంబర్ 04 ప్రజాజ్యోతి** ఖమ్మం జిల్లా వేంసూరు మండలం రాయుడుపాలెం గ్రామ సమీపంలోని గుట్ట పక్కన ఖాళీ ప్రదేశంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై వేంసూరు పోలీసులు గురువారం సాయంత్రం దాడి చేశారు.విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై ప్రదీప్ తమ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని పేకాట స్థావరంపై దాడి చేయగా, పేకాట ఆడుతున్న ఇద్దరు వ్యక్తులు పోలీసులకు పట్టుబడ్డారు. పోలీసులను గమనించిన మరో ఆరుగురు వ్యక్తులు అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు.పట్టుబడిన వారి వద్ద నుంచి 52 పేకముక్కలు, రూ.3,200 నగదు, నాలుగు ద్విచక్ర వాహనాలు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి మొత్తం ఎనిమిది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

- భక్తిశ్రద్ధలతో గ్రామస్తులు ప్రత్యేక పూజలు



**బోనకల్, సెప్టెంబర్ 4(ప్రజా జ్యోతి)** :మండల పరిధిలోని ముష్టికుంట్ల గ్రామంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరిగాయి. పండుగను పురస్కరించుకుని భక్తులు స్థానిక శ్రీ కోదండ రామస్వామి వారి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం కృష్ణాష్టమి సంబరాల్లో భాగంగా ఏ ర్పాటు చేసిన 'ఉట్టి కొట్టు' కార్యక్రమం కనులపండువగా సాగింది. ఈ ఉట్లోత్సవంలో ముష్టి కుంట్ల గ్రామ యాదవ సోదరులు, గ్రామ పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. యువకులు ఉత్సాహంగా పోటీ పడి ఉట్టిని కొట్టడంతో ఆలయ ప్రాంగణమంతా జై శ్రీకృష్ణ స్మరణలతో మార్మోగింది. గ్రామస్తులందరూ ఏకమై భక్తిభావంతో ఈ వేడుకను జరుపుకోవడం పట్ల పెద్దలు హర్షం వ్యక్తం చేశారు.గ్రామ ప్రముఖులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కృష్ణ పరమాత్ముని కృపకు పాత్రులయ్యారు.

# మహిళలు ఆర్థికంగా ఎదిగి కోటీశ్వరులవ్వాలి..









(మొదటి పేజీ తరువాయి...)

భాగంగా నిర్వహించిన ఇందిర మహిళాశక్తి సదస్సులో మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌లతో కలిసి పాల్గొన్నారు. మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, మహిళలు పెద్ద ఎత్తున ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరవుతున్నారంటే ప్రభుత్వంపై వారికి ఉన్న ప్రేమ, విశ్వాసానికి నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలను కుటుంబ సభ్యులుగా భావిస్తూ, వారి ఆర్థిక స్వావలంబనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పమని మంత్రి తెలిపారు. మహిళలు తమకు నచ్చిన వ్యాపారాలను ప్రారంభించి, స్వయం ఉపాధి పొందుతూ కుటుంబానికి అండగా నిలవాలని సూచించారు. ఇందుకోసం మహిళా సంఘాలకు ఏపీఎంలు, డీఆర్‌డీఓ అధికారులు అవసరమైన సహకారం అందిస్తారని చెప్పారు. సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధికి గత రెండున్నరేళ్లలో పంచాయతీరాజ్, మహిళా సంఘాల సంక్షేమం, తాగునీరు తదితర రంగాల్లో సుమారు రూ.300 కోట్ల వరకు నిధులు కేటాయించడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి పల్లె, గూడెం, తండా, వాడలో అవసరమైన సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మహిళా సంఘాలు కేవలం పొదుపు, రుణాలకే పరిమితం కాకుండా వ్యాపార రంగంలోకి రావాలని మంత్రి పిలుపునిచ్చారు. మహిళా అర్థిక పురోగతికి కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి మేడారం జాతర సందర్భంగా మహిళా సంఘాలకు సుమారు రూ. 6 కోట్ల మేర రుణ సహాయం అందించగా, మహిళలు కేవలం 15 రోజుల్లోనే సుమారు రూ.9 కోట్ల వ్యాపారం చేసి లాభాలు ఆర్జించారని గుర్తుచేశారు.

సత్తుపల్లిలో కూడా టిఫిన్ సెంటర్లు, క్యాంటీన్లు, డెయిరీ, పౌల్ట్రీ, సోలార్, కుట్టు యూనిట్లు, స్థానికంగా లభించే అటవీ ఉత్పత్తుల ఆధారంగా వివిధ వ్యాపారాలు ప్రారంభించాలని సూచించారు. స్థానికంగా లభించే ఉత్పత్తులను విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చి విక్రయిస్తే మహిళలకు మంచి ఆదాయం వస్తుందని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, కలెక్టరేట్లు, ఇతర ప్రజలు ఎక్కువగా వచ్చే ప్రాంతాల్లో మహిళా సంఘాలతో ఇందిర మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని మంత్రి పేర్కొన్నారు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో మహిళలు క్యాంటీన్ల ద్వారా నెలకు రూ. 50 వేల నుంచి రూ. లక్ష వరకు ఆదాయం పొందుతున్నారని తెలిపారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని, రుణాలపై వడ్డీ భారాన్ని ప్రభుత్వం భరిస్తోందన్నారు. మహిళా సంఘాల సభ్యులకు రుణ బీమా సదుపాయం కల్పిస్తూ, రుణం తీసుకున్న సభ్యురాలు మరణించిన సందర్భంలో నిర్దిష్ట పరిమితి వరకు రుణాన్ని మాఫీ చేసే విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా ప్రమాదవశాత్తు మహిళలు మరణించినప్పుడు వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు రూ.10 లక్షల వరకు సహాయం అందిస్తున్నామని చెప్పారు.

## మహిళలకు ఆత్మగౌరవ భవనాలు

మహిళా సంఘాల సమావేశాలు చెట్ల కింద లేదా ఇతరుల ఇళ్ల వద్ద నిర్వహించాల్సిన పరిస్థితి ఉండకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వీవో భవనాలను నిర్మిస్తోందన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలో ఇప్పటికే అనేక వీవో భవనాలు మంజూరు చేశామని, ఇంకా అవసరమైన భవనాలను కూడా మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. జిల్లా సమాఖ్యల కోసం రూ. 5 నుంచి రూ.7 కోట్ల వ్యయంతో భవనాలను నిర్మిస్తున్నామని, మహిళల శిక్షణ, సమావేశాలు, వ్యాపార కార్యకలాపాలకు అవి ఉపయోగపడతాయని చెప్పారు.

## మహిళల విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యత

మహిళలకు అక్షరాస్యత కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. మహిళా సంఘాల్లోని నిరక్షరాస్యులందరికీ చదువు నేర్పించాలన్న లక్ష్యంతో కార్యక్రమాలు కొనసాగుతున్నాయని చెప్పారు. మహిళలు విద్యావంతులై, తమ పిల్లలను ఉన్నత స్థానాలకు తీసుకెళ్లాలని సూచించారు.

## ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలకు స్వేచ్ఛ

మహిళలు అత్యవసర సమయాల్లో తమ పనుల కోసం ఎక్కడికైనా స్వేచ్ఛగా వెళ్లే అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిందన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు మహిళలు సులభంగా ప్రయాణించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు మహిళల పేర్లపై

మహిళలకు ఆర్థిక, సామాజిక భద్రత కల్పించడంలో భాగంగా ఇందిరమ్మ ఇళ్లను మహిళల పేర్లపై మంజూరు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఇల్లు, రేషన్ కార్డు వంటి ప్రభుత్వ ప్రయోజనాల్లో మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తున్నామని చెప్పారు. అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేస్తున్నామని, మినీ అంగన్వాడీలను ప్రధాన అంగన్వాడీలుగా మార్చి సిబ్బందికి వేతనాలు పెంచామని, రిటైర్మెంట్ ప్రయోజనాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అంగన్వాడీ పిల్లలకు యూనిఫాంలతో పాటు అల్పాహారం, పోషకాహారం అందించే కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు.

అంగన్వాడీ కేంద్రాల్లోనే చిన్నారులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకుంటున్నామని, పిల్లలను తప్పనిసరిగా ప్రైవేట్ పాఠశాలలకు పంపాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ అంగన్వాడీలను మరింత బలోపేతం చేస్తున్నామని వివరించారు. స్థానిక **వనరులను ఆదాయ వనరులుగా మార్చుకోవాలి**

గ్రామాల్లో లభించే సహజ వనరులు, అటవీ ఉత్పత్తులు, సంప్రదాయ ఆహార పదార్థాలను మహిళలు వ్యాపారాలుగా మలచుకోవాలని మంత్రి సూచించారు. ఇప్పపువ్వు లడ్డూల వంటి స్థానిక ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉందని, వాటిని పరిశుభ్రంగా, నాణ్యతతో తయారు చేసి మార్కెట్ చేస్తే మహిళలకు మంచి ఆదాయం లభిస్తుందని చెప్పారు.

మహిళలు ప్రతి నెలా రూ.10 వేల నుంచి ప్రారంభించి లక్షలు, చివరకు కోట్లు సంపాదించే స్థాయికి ఎదగాలన్న పట్టుదలతో పనిచేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ మహిళల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందిస్తున్న పథకాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని తెలిపారు. చిన్న స్థాయిలో కుట్టు మిషన్‌తో ప్రారంభించిన మహిళలు నేడు పెద్ద కంపెనీలు నిర్వహించే స్థాయికి ఎదుగుతున్నారని అన్నారు. ఇందిర మహిళాశక్తి కార్యక్రమం కింద మహిళలకు వివిధ రంగాల్లో ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నామని తెలిపారు. ఖమ్మం జిల్లాలో కూడా మహిళల ఆధ్వర్యంలో సోలార్ పవర్ ప్లాంట్ ప్రారంభం కావడం విశేషమని, దాని ద్వారా నెలకు సుమారు రూ. 2.50 లక్షల వరకు ఆదాయం లభించే అవకాశం ఉందని చెప్పారు. చిన్న స్థాయి వ్యాపారం నుంచి పెద్ద స్థాయి పరిశ్రమల వరకు మహిళలను భాగస్వామ్యం చేస్తూ ప్రోత్సహిస్తున్నామని అన్నారు. మహిళా సంఘాల సభ్యులకు రుణాలు, బీమా తదితర సౌకర్యాలు కల్పించడం ద్వారా ఆర్థిక భద్రతను కల్పిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. రుణం తీసుకున్న సభ్యురాలు మరణించిన సందర్భంలో కుటుంబ సభ్యులపై రుణభారం పడకుండా లోన్ ఇన్సూరెన్స్, లోన్ వేవర్ వంటి సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు.

మహిళలు ఒకే రంగంకు పరిమితం కాకుండా వివిధ వ్యాపార, పారిశ్రామిక రంగాల్లోకి అడుగుపెట్టి ఆర్థికంగా బలోపేతం కావాలని కలెక్టర్ సూచించారు. మహిళా సంఘాలు ఐక్యతతో ముందుకు సాగుతూ అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అనంతరం సత్తుపల్లి శాసన సభ్యురాలు సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ, గతంలో మహిళా సంఘాలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాయని, రుణాలపై అధిక వడ్డీ భారంతో చాలామంది సభ్యులు సంఘాల నుంచి వైదొలిగిన పరిస్థితులు ఉన్నాయని అన్నారు.

ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని తెలిపారు. కిశోర బాలికలు, వృద్ధులు, దివ్యాంగులు తదితర వర్గాల కోసం ప్రత్యేక గ్రూపులను ఏర్పాటు చేసి మహిళా సంఘాల కార్యకలాపాలను మరింత విస్తరిస్తున్నామని చెప్పారు.

సత్తుపల్లి నియోజకవర్గంలో కొత్తగా సుమారు 470 మహిళా సంఘాలు ఏర్పడటం మహిళల్లో పెరుగుతున్న చైతన్యానికి నిదర్శనమన్నారు.

మహిళా సంఘాలకు వారి అర్హతను బట్టి పెద్ద మొత్తంలో రుణాలు అందిస్తున్నామని, ఈ రుణాలపై మహిళలు ప్రైవేట్ వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం వడ్డీలేని రుణాలను అందిస్తోందని తెలిపారు. రుణాలపై వడ్డీని కూడా ప్రభుత్వం భరిస్తోందన్నారు. మహిళల కోసం ప్రమాద బీమా, లోన్ బీమా వంటి సౌకర్యాలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందని, లోన్ బీమా కింద ఇప్పటికే సుమారు 870 మంది సభ్యులకు ప్రయోజనం అందించామని ఎమ్మెల్యే తెలిపారు.

ఉచిత బస్సు ప్రయాణం, మహిళా సంఘాలకు వ్యాపార అవకాశాలు, సోలార్ యూనిట్లు, ఇతర ఉపాధి కార్యక్రమాలు మహిళలను ఆర్థికంగా స్వావలంబులుగా తీర్చిదిద్దుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ రెహ్మాన్ బేగం, కల్లూరు ఎసీపీ వసుందర, సత్తుపల్లి మున్సిపల్ కమీషనర్ నరసింహ, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ బొంతు సుమలత, మండల పార్టీ అధ్యక్షుడు భీమిరెడ్డి సుబ్బారెడ్డి, పట్టణ అధ్యక్షుడు గాదె చెన్నారావు, గొర్ల మారి రామ్మోహన్ రెడ్డి, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, కాంగ్రెస్ అభిమానులు, కార్యకర్తలు, మహిళలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.